www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

మంగళవారం 10 జనవరి 2023

1

తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ



బాసర: మండల కేంద్రంలోని రవీంద్రపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయురాలు రాధిక తన తండ్రి కేశవ్ మోహన్ జ్ఞాపకార్థం తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులకు టీ షర్టులు అందజేశారు. సర్పంచ్ లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ రమేష్ చేతుల మీదుగా విద్యార్థులకు టీ షర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోహన్ ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఆడపిల్లలను తక్కువ చేయకుండా వారి పిల్లలను మంచి స్థాయికి తెచ్చారని తెలిపారు. తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు పాఠశాల పేరుతో ఉన్న టీ షర్టులు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మమ్మయి శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ సంబాజీ, కృష్ణ జాదవ్, గురప్ప శంకర్, శివాజీ, అమూల్ పాల్గొన్నారు.

తాండూర్ కేజీబీవీలో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-తాండూర్



కేజీబీవీలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అందమైన ముగ్గులతో కేజీబీవీలో పండగ వాతావరణం నెలకొంది. ఎస్ఓ కవిత పిల్లలతో హరిదాసుల వేషాలు వేయించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పాడిపంటలు ఇల్లు చేరి ప్రతి కుటుంబం సంతోషం మధ్య జరుపుకునే పండుగ సంక్రాంతి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమన, చైతన్య, శారద, కవిత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతులు కల్పించాలి

- కలెక్టర్‌కు ఎన్ఎస్‌యూఐ నాయకుల వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్‌రావు అన్నారు. సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా కార్యక్రమాలు చేపట్టినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు, ల్యాబ్ సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్, కళాశాల కార్యదర్శి సచిన్ పాల్గొన్నారు.

స్టడీ హాల్ అభ్యర్థులకు రీడింగ్ ప్యాడ్స్ అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ స్టడీ హాల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఓ ఎంప్లాయీస్ యూనియన్ తరపున రీడింగ్ ప్యాడ్స్‌ను పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు. బేల మండలం సాంగిడి గ్రామానికి చెందిన ఎంప్లాయీస్ యూనియన్ 75మంది తరపున రూ.3000 విలువైన 25 రీడింగ్ ప్యాడ్స్ సోమవారం బీసీ స్టడీ సర్కిల్‌లో స్టడీ హాల్ అభ్యర్థులకు అందజేశారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ అశోక్, రాంనగర్ రవీందర్‌రెడ్డి, అటవీ శాఖ ఉద్యోగి మహేందర్, మున్సిపాలిటీ ఉద్యోగి రమ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని దేశ్‌ముఖ్ క్లినిక్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదిలాబాద్‌లోని జనరల్ ఫిజియన్ డాక్టర్ విఠల్ ఆడే వైద్య శిబిరానికి హాజరై మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ నదీం సేవలు అభినందనీయమని తెలిపారు. వైద్య శిబిరానికి సుమారు 250 మంది రోగులు హాజరయ్యారు. ఆస్తమా, బీపీ, షుగర్, కాళ్ల నొప్పులు తదితర వ్యాధులు కలిగిన రోగులను పరిశీలించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం వైద్య శిబిరానికి హాజరైన డాక్టర్ విఠల్‌ను దేశ్‌ముఖ్ క్లినిక్ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫారసిస్ట్ కాలిక్‌హుస్సేని, ఉప సర్పంచ్ నిసార్ అహ్మద్ పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

నవతెలంగాణ-బాసర

మండల పరిధిలోని టాక్లి గ్రామ సమీపాన సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండలం యంచ గ్రామానికి చెందిన సాయిలు(35) అక్కడికక్కడే మృతి చెందగ నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం బినోల గ్రామానికి చెందిన రాజశేఖర్ తీవ్రగాయాల పాలైనట్టు ఎస్సై మహేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం యంచ గ్రామానికి చెందిన సాయిలు బాసర నుండి బైంసా వైపు వెళుతుండగా బైంసా నుంచి బాసర వైపు వస్తున్న రాజశేఖర్ ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. గాయాల పాలైన రాజశేఖర్ స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌ను కలిసిన సుహాసినిరెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోస్టల్ సూపరింటెండెంట్ కేబీఆర్ ప్రసాద్‌ను బిజెపి రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ప్రవేశపెట్టిన పది లక్షల రూపాయల ప్రమాద బీమా పథకాన్ని వాహనాల డ్రైవర్లకు, ఆదిలాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తలకు చేయిస్తున్న నేపథ్యంలో మండలాల వారీగా అదనపు సిబ్బందిని కేటాయించాలని కోరారు. ఈ విషయంపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

చలి పులి..!

- కనిష్ట స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- సిర్పూర్(టి)లో 4.8, ఆదిలాబాద్‌లో 6డిగ్రీలు నమోదు
- ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో మరింత అధికం
- చలిమంటలతో రక్షణ పొందుతున్న జనాలు

ఉమ్మడి జిల్లాను చలి గజగజ వణికిస్తోంది. శీతల గాలుల ప్రభావం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై అధికంగా పడుతోంది. ఫలితంగా తీవ్రస్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం తట్టుకోలేకపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. మిట్టమధ్యాహ్నం సమయంలో ఎండ ప్రభావంలోనూ చల్లని వాతావరణం ఉంటోంది. వృద్ధులు, చిన్నారులు వివిధ అనారోగ్యాల భారిన పడుతున్నారు. డిసెంబర్ నెలలో అంతగా చలి ప్రభావం లేకపోవడం.. ఈ సమయంలో 18డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కానీ జనవరి మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోయాయి. వారం రోజులు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం తట్టుకోలేకపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో చలి ప్రభావానికి తట్టుకోలేకపోతున్నారు. తాజాగా సిర్పూర్‌లో 4.8డిగ్రీలు నమోదు కాగా.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 6డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పట్టణ ప్రాంతాల్లోనే ఈ స్థాయిలో ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో చలి పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పేరు చెప్పగానే అనూహ్య వాతావరణ మార్పులకు కేంద్రబిందువుగా మారుతోంది. ఇక్కడ మూడు కాలాల పాటు అన్ని ఎక్కువగానే నమోదవుతుంటాయి. ఎండ కాలంలో వేడి..వర్షాకాలంలో ఎడతెరిపి వానలు, చలి కాలంలో గజగజ వణికించే చల్లగాలులు వీయడం జిల్లాలో సాధారణ అంశంగా మారుతోంది. రాష్ట్ర మంతా ఒక పరిస్థితి ఉంటే..ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం మరోలా ఉంటుందనే అక్కడి జనాల అభిప్రాయం. తాజాగా వారం రోజుల నుంచి చలి తీవ్రత అధికం కావడంతో జనాలు హైరానాకు గురవుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోనే ఈ స్థాయిలో చలి ప్రభావం చూపిస్తుంటే.. ఇక అడవులతో ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉండటంతో అక్కడ చలి తీవ్రత ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇంద్రవెల్లిలో 5.7డిగ్రీలు, బజార్‌హత్నూర్‌లో 5.7 డిగ్రీలు నమోదైంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల పల్లెల్లో అడవుల నుంచి వీచే చలిగాలులతో ఆదివాసీ, గిరిజనులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో చలి మంటలు కాగుతూ రక్షణ పొందుతున్నారు. ఈ చలి తీవ్రతకు కేవలం మనుషులే కాకుండా మూగజీవాలు కూడా తట్టుకోలేకపోతున్నాయి. వాటి యజమానులు ప్రత్యేకంగా రక్షణ దుస్తులు ధరించి వాటిపై కప్పుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమం..!

ఈ తీవ్రమైన చలి నుంచి ఉపశమనం పొందాలంటే రక్షణ చర్యలు తీసుకోవడమే ఉత్తమమని వైద్యులు చెబుతున్నారు. శీతలగాలులు భూమికి దగ్గరగా వీయడంతోనే ఈ సమస్య ఎక్కువగా వస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. మరికొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు. కాగా వృద్ధులు, చిన్నారుల పట్ల ఆరోగ్యం పట్ల తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆస్తమా, సీఓపీడీ వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. చలి ప్రభావం చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారు. చలి తీవ్రత కారణంగా ఉదయం పూట విధులకు వెళ్లే కార్మికులు, పాల వ్యాపారులు, పారిశుద్ధ్య కార్మికులు తదితర రంగాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటల కంటే ముందు.. సాయంత్రం 6గంటల తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జనాలు సాయంత్రం 6గంటల నుంచి చలి మంటలను రక్షణగా మార్చుకుంటున్నారు. చలి తీవ్రత దృష్ట్యా కిందటేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బడి వేళల్లో మార్పులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పోలీస్ పేరుతో దోపిడీకి పాల్పడ్డ నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ కిరణ్‌ఖారే



నవతెలంగాణ-భైంసా

పోలీస్ పేరుతో దారి దోపిడీకి పాల్పడ్డ నిందితుడు మహ్మద్ జహీర్‌ను అరెస్టు చేశామని ఏఎస్పీ కిరణ్ ఖారే తెలిపారు. సోమవారం భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు నెలల క్రితం తిమ్మాపూర్ వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వాహనదారుడిని ఆపి వాహన పత్రాలు చూపించాలంటూ మాటల్లో పెట్టి అతని వద్ద నుంచి రూ.2లక్షల నగదు దోపిడీ చేశాడు. కోతల్‌గాం గ్రామానికి చెందిన బాధితుడు భూమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలించారు. నిర్మల్ పట్టణానికి చెందిన మహ్మద్ జహీర్‌గా గుర్తించారు. అతని కోసం స్పెషల్ టీం వెతుకుతుండగా నిర్మల్‌లో అరెస్టు చేశారు. ఆయనపై నిర్మల్‌లో నాలుగు కేసులు ఉన్నాయి. స్పెషల్ టీం హెడ్‌కానిస్టేబుల్ నరహరి, హోంగార్డు శంకర్‌కు ఎస్పీ రివార్డులను అందించారు. ఈ సమావేశంలో సీఐ చంద్రశేఖర్, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

దీక్ష భూమి కొత్తపల్లి జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సంత్ శ్రీసేవాలాల్ దీక్షభూమి జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని గిరిజన లంబాడి ఐక్యవేదిక(లైవ్) రాష్ట్ర కార్యదర్శి రాథోడ్ సుధాకర్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ అన్నారు. సోమవారం కొత్తపెల్లి(హెచ్)లో ఈ నెల11న జరిగే 44వ గురుకృప పూజ జాతర కరపత్రాలను దీక్ష గురు ప్రేంసింగ్ మహారాజ్‌తో కలిసి విడుదల చేశారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ దీక్షభూమి గురుకృప దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 9 నుండి 15 వరకు నిర్వహించే సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ దీక్షభూమి జాతరను ప్రారంభించారు. జేఏసీ సలహాదారులు రాథోడ్ నారాయణ మాట్లాడుతూ శ్రీజగదంబా దేవి, బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ సంత్ శ్రీతపస్వీ బాల బ్రహ్మచారి రామారావ్ మహారాజ్‌కు నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు బంజారా కులస్తులు అధిక సంఖ్యలో హాజరై దీక్షభూమి జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. పూజ రోజు పల్లకి పాదయాత్ర గంగాపూర్ తండా నుండి దీక్ష భూమి కొత్తపల్లి వరకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర సాంస్కృతిక వింగ్ కార్యదర్శి రాథోడ్ నరహరిదాస్, పవార్ దేవిదాస్, ఆడే సురేష్, రెడ్డి నాయక్, లైవ్ లంబాడీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జాదవ్ వసంత్‌రావ్, జిల్లా అధ్యక్షులు జాదవ్ మహేందర్, సేవాదాస్, జాదవ్ గణపత్, బానోత్ రవీందర్, జాదవ్ విద్యారాణి పాల్గొన్నారు.

తల్లీబిడ్డ మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందారని కుటుంబ సభ్యుల ఆరోపణ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

అధిక రక్తస్రావంతో తల్లీబిడ్డ మృతి చెందిన ఘటన విషాదం నింపింది. తల్లీబిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గూడెం గ్రామానికి చెందిన దిగిడే శోభకు పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్‌లో కౌటాల సామాజిక ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆస్పత్రికి ఉదయాన్నే చేరుకున్నప్పటికీ సాయంత్రం వరకు వైద్యులు చికిత్స అందించలేద. అధిక రక్తస్రావం అవుతున్నా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఏడు గంటల అనంతరం చివరి క్షణాల్లో కాగజ్‌నగర్ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కోమాలోకి వెళ్లే స్థితికెళ్లింది. దీంతో అక్కడి నుండి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వైద్యం చేసినప్పటికీ భరోసా కల్పించే పరిస్థితులు లేవని, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించాలని సూచించారు. కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు భర్త శ్రీను తెలిపారు. శ్రీను, శోభకు తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. సంవత్సరం క్రితం ఆడ బిడ్డకు జన్మనివ్వగా, పురిట్లోనే మృతి చెందింది. 15 నెలల అనంతరం మగ బిడ్డ పుట్టగా తల్లీబిడ్డ కన్నుమూయడంతో గ్రామంలో విషాదం నెలకొంది.



విషయం తెలుసుకొని గ్రామస్తులు శ్రీను ఇంటికి తరలొచ్చారు. సర్పంచ్ రాఘవరెడ్డి కుటుంబీకులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

13, 14న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ - రెబ్బెన

ఈ నెల 13, 14న జరిగే 5వ రాష్ట్ర మహాసభల్లో ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతం దిశగా జరిగే ఈ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. 13, 14 తేదీల్లో రంగారెడ్డిలోని మన్నెగూడ, సాగర్‌రోడ్డులోని బీఎంఎన్ పార్ధ కన్వేషన్స్‌లో మహాసభలు జరుగుతాయని తెలిపారు. మొదటిరోజు ఉదయం ఉపాధ్యాయుల మహా ప్రదర్శన ఉంటుందని, అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ మాజీ



ఆరోగ్య శాఖా మంత్రి కెశైలజ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఎంఎల్‌సీ నలుగుపెల్లి నర్సిరెడ్డి హాజరవుతారని తెలిపారు. రెండో రోజు ప్రతినిధుల సభలో విద్యారంగ పరిస్థితులు, సమస్యలపై చర్చ, సమీక్ష, భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హేమంత్ షిండే, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతురావు, మహేందర్, మండల నాయకులు కృష్ణవేణి, బిందు రజిని, కేజీబీవీ ఎస్ఓ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ప్రతిష్టించాలి

నవతెలంగాణ-తాండూర్



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ట్యాంకు బండ్‌పై ఏర్పాటు చేయాలని, వారి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చాలని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ కోరారు. సోమవారం బెల్లంపల్లి కొత్తబస్టాండ్ చౌరస్తాలో ఎంసీపీఐ(యు) అమరవీరుల స్థూపం వద్ద భీంరెడ్డి నరసింహారెడ్డి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం భూస్వాములను ఎదిరించి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన తెలంగాణ సాయుధ పోరాట యోధులను, కమ్యూనిస్టులను తెలంగాణ ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు పోరాటాలు చేసి సాధించిన హక్కులను, చట్టాలను, పాలక ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రపంచం గర్వించదగ్గ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను, వీరుల గాథలను ప్రజలందరికీ తెలిసే విధంగా వర్ధంతులు, జయంతులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్, కొండ శ్రీనివాస్, బర్ల స్రవంతి, సబ్బని విజయలక్ష్మి, కాంపల్లి రాధ, కామెర పద్మ, రాజశేఖర్, వంశీ ఆకాష్, మల్లేష్, లక్ష్మి పాల్గొన్నారు.

పంట సిరితో రైతులకు లాభం

కౌటాల : పంట సిరితో రైతులకు లాభం చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తయారు చేసిన సేంద్రియ ఎరువుల మేళాలో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ సాగులో రైతులు సేంద్రియ ఎరువులను వాడినట్టయితే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. క్రిమిసంహారక మందులు వాడడం వల్ల భూమిలోని భూసారం తగ్గి పంటల దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. రసాయన ఎరువుల వాడడం వల్ల భవిష్యత్తు తరాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. రసాయన ఎరువులతో పండించిన పంటలను తినడం వల్ల ఆరోగ్యం చెడిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. సేంద్రియ ఎరువులు వాడినట్టయితే ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా ఉండవచ్చన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల బయట పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పాఠశాలను సందర్శించి వసతులు, విద్యార్థులకు అవసరమగు ఇతరత్రా సామగ్రి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సిరి పంట మేళాలో మండల వ్యాప్తంగా 1120 కిలోల సేంద్రియ ఎరువులను విక్రయించడం ద్వారా రూ.33,650 వచ్చినట్టు ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, ఎంపీఓ సుధాకర్‌రెడ్డి, ఏపీఓ పూర్ణిమ, ఏపీఎం వెంకటరమణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నిషేధిత మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఆర్.శంకర్ హెచ్చరించారు. సోమవారం పతంగి, మాంజా విక్రయ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని పతంగిలతో సరదా చేయడం ఆనవాయితీ అని, ఇదే అవకాశంగా మానవాళికి ప్రమాదకరమైన నిషేధిత చైనా మాంజా విక్రయించినా, నిలువ ఉంచినా వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ స్పష్టం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఇటీవల పీచర గ్రామానికి చెందిన కాల్వ సతీష్ నిర్మల్ జిల్లా జైలులో మృతి చెందిన సంగతి విధితమే. డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి సురేందర్ రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, సర్పంచ్ బుర్రి లత భూమేష్ సోమవారం బాధిత కుటుంబన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి సురేందర్ రెడ్డి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు అండగా ఉంటామని ఆందోళన చెందవద్దని తెలిపారు.



తరలిస్తున్న కలప పట్టివేత

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని అక్రమంగా తరలిస్తున్న కలప వానాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్టు ఎఫ్ఎస్ఓ సుందర్ తెలిపారు. మండల కేంద్రంలోని మైసమ్మ గల్లీలో టాటా ఏసీ వాహనం టీఎస్ 01యూసీ 0248 గల వాహనాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో అక్రమంగా కలప తరలిస్తున్న సమాచారం మేరకు ముందస్తుగా వాహనాన్ని తనిఖీ చేయడంతో అందులో కలప దుంగలు ఉన్నాయని అన్నారు. వాటి విలువ రూ.33,916 ఉందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు నాగోరావు, ధన్‌రాజ్, కోసే రావు, సిబ్బంది జాబిర్ ఉన్నారు.



అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ప్రజావాణిలో వచ్చిన అర్జీలు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్‌తో కలిసి ప్రజలనుండి అర్జీలను స్వీకరించారు. ఫించన్లు, వైద్యం భూసంబంధిత, ఉపాధి, ధరణి, దళితబంధు, డబుల్ బెడ్‌రూం మంజూరు, తదితర సమస్యలపై వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారిగా వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అంతకు ముందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ నేడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం గం.10:30గంటలకు కంటి వెలుగు కార్యక్రమంపై మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించ నున్నారని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు, జెడ్పీటీసీ లు, కౌన్సిలర్‌లు, ఎంపీపీలు, ఎంపీడీఓలు, మండల, జిల్లా ప్రత్యేక అధికారులు, మెడికల్ ఆఫీసర్‌లు, సంబధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, డీఆర్డీఓ కిషన్, మున్సిపల్ కమీషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దిలేష్ చౌహన్, జిల్లా అధ్యక్షుడు జాధవ్ అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో పీఓ వరుణ్‌రెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని పీఓ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. అదే విధంగా ప్రస్తుతం చాలా ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు నిపుణుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. వాటి స్థానంలో ప్రత్యేక ట్యూటర్లను నియమించాలని అన్నారు. ఆశ్రమ ఉన్నత పాఠశాలల నుండి హాస్టల్స్‌ను వేరు చేసి ప్రత్యేక వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులను మినహాయించాలని, మినహాయించని పక్షంలో అదనపు అలవెన్సులు ఇవ్వాలని అన్నారు. జీఓ 317 ద్వారా చాలా మంది గిరిజన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని పీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జాదవ్ రవి కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు శీతల్ చౌహన్, మండల అధ్యక్షుడు వామన్ రావ్, నాయకులు దినేష్, ఆత్మారాం ఉన్నారు.

కడెం ప్రాజెక్ట్ నీటి విడుదల

నవతెలంగాణ-కడెం

నేడు యాసంగి ఆరుతడి పంటలకు కడెం ప్రాజెక్టు నుంచి మంగళవారం ఉదయం 9గంటలకు నీటిని విడుదల చేయటం జరుగుతుందని ఈఈ సీహెచ్‌వీ రాజశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖానాపూర్, మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేలు అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్, దివాకర్ రావుల చేతుల మీదుగా యాసంగి పంటలకు నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు.

జోడో పాదయాత్రను విజయవంతం చేయండి

నవతెలంగాణ-బోథ్

హాత్ సే హాత్ జోడో పాదయాత్రను విజయవంతం చేసేందుకు మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేడు సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల కన్వీనర్ కుర్మే మహేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న ఏఐసీసీ పీసీసీ, ఆదేశాల మేరకు జోడో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అలాగే ఈ పాదయాత్రను విజయవంతం చేసేందుకు నేడు జరగబోయే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా నియోజకవర్గం నాయకులు ఆడే గజేందర్, మండల అధ్యక్షుడు ప్రఫుల్‌రెడ్డి, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్ ఖాన్, హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మహాధర్నా

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం డబుల్ బెడ్ రూం దరఖాస్తుదారులు, సొంత ఇల్లు లేని నిరుపేద ప్రజలతో సభను ఏర్పాటు చేశారు. సభకు ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు భోస్లే మోహన్ రావ్ పటేల్ పాల్గొని, ప్రజా సమస్యలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నియంతృత్వ పోకడలతో కూడిన పరిపాలనను చూసి రాష్ట్ర ప్రజలు అయోమయానికి గురువుతున్నారని, మోసపూరితమైన ప్రకటనలతో రెండు సార్లు గద్దెనెక్కి ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి ఒక్కొక్కరిపై లక్షల కొద్ది అప్పులు పెట్టి కూర్చున్నాడని అన్నారు. 2018 ఎన్నికల హామీ ప్రకారం తక్షణమే అర్హులైన పేద వారికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు. స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయలు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించాలని అన్నారు. పేదప్రజలను మభ్యపెట్టి కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, కౌన్సిలర్ దిలీప్, గాలి రవి, నాయకులు నగర్ నారాయణరెడ్డి, సుభాష్ పటేల్, భూమయ్య, మహేందర్ రెడ్డి, అనిల్, నరహరి, పోతన్న పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి

- తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని వసతి గృహాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లిలోని గురుకులంలో ప్రహరీ గోడ, నీటి సమస్య, విద్యార్థుల సంఖ్యను బట్టి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. కేజీబీవీలో కొందరి విద్యార్థులకు ఇప్పటి వరకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని అన్నారు. వీరికి కూడా మరుగుదొడ్లు లేవని, ఉట్నూర్‌లోని బాలుర ఆశ్రమ పాఠశాలలో డార్మేంటరి గదిలో ఫ్లోరింగ్ లేదని ఇలా అనేక ఆశ్రమాల్లో, గురుకులాలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. దీనిపై ఇదివరకే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువచ్చామని అన్నారు. అయిన తీరు మరలేదని అన్నారు. అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. లేకుంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని తెలియజేశారు. ఆయన వెంట సంఘం జిల్లా అధ్యక్షుడు తుంరం ఈశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు కనక మల్కు ఉన్నారు.



మధ్యాహ్నభోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.2వేలు వేతనం పెంచి, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు 2 నెలల నుంచి బిల్లులు, వేతనాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ హామీ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.2వేల వేతనం జీఓ విడుదల చేయాలన్నారు. ధరలు విపరీతంగా పెరిగినా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచడంలేదని వాపోయారు. సబ్సిడీపై గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. మెనూ చార్జీలు పెంచకపోవడంతో అప్పులు చేసి ఆర్థికంగా చితికి పోతున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

అధిక విద్యుత్ బిల్లులు వసూలుతో వినియోగదారుల బెంబేలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

విద్యుత్ సంస్థ వినియోగదారుల నుంచి కొత్త రకం వసూళ్లకు తెరలేపింది. ఏసీడీ (అడ్వాన్స్ కన్జప్షన్ డిపాజిట్) పేరిట కొత్తరకం వసూళ్లతో సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సోమవారం మండలంలోని చింతల్‌చాంద గ్రామంలో అధిక విద్యుత్ బిల్లులకు నిరసనగా వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 300 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ వినియోగించిన వారికి మాత్రమే ఏసీడీ వసూలు చేసేవారు. ఇప్పుడు అంత కంటే తక్కువ యూనిట్‌లు వినియోగించిన ఏసీడీ చెల్లించక తప్పడం లేదని సామాన్యుల పాలిట గుదిబండగా మారిందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెవలప్‌మెంట్ చార్జీల పేరిట సామాన్యుని మీద ఆర్థిక భారం వేసి, సంవత్సరం గడవక ముందే మరో రకం వసూలుకు తెర లేపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.



తక్షణమే ఈ నిర్ణయన్ని వెనక్కి తీస్కోవాలి

ప్రభుత్వం ఏసీడీ పేరిట సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టడం సరైంది కాదు. ఏసీడీ నిధులు వసూలు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలి. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తాం

సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా నాయకులు ఎస్ గంగన్న



ఏసీడీ అనేది వినియోగదారులు చెల్లించేది డిపాజిట్ మాత్రమే

ఏఈ మహేష్

విద్యుత్ చార్జీలు కావు, లోడ్ సామర్థ్యం ఆధారంగా మాత్రమే విధిస్తున్నాం. ఎలాంటి అపోహలు నమ్మవద్దు. ఏదైనా సమాచారం కోసం విద్యుత్ శాఖ సిబ్బందని సంప్రదించాలని అన్నారు.

దినసరి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏలో ఎన్నో ఏండ్లుగా చాలిచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న దినసరి కార్మికులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ ముందు చేస్తున్న దీక్షలు 78వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు పూసం సచిన్ మద్దతు తెలిపి, సమస్యలను తెలుసుకొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే కార్మికులను రెగ్యూలర్ చేస్తున్నామని కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన విషయం అందరికి తెలిసిందే. ఐటీడీఏలో దినసరి కార్మికులుగా దశాబ్దాల కాలంగా వంద రూపాలయ నుంచి విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అయిన ప్రభుత్వం ఈ కార్మికులపై దాయలేదన్నారు. చాలిచాలని వేతనాలతో అనారోగ్యం బారిన పడి మృతి చెందిన సంఘటనలు పట్టించుకునే వారే లేరని అన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి దినసరి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దినసరి కార్మికులు ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఈనెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలోని మన్నెగూడలో నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కాంబ్లే విజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని దేగామ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య చేతుల మీదుగా రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కాంబ్లే విజయ్ మాట్లాడుతూ ఈ మహాసభలకు తెలంగాణ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యారంగ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంఈఓ శ్రీకాంత్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ సభ్యులు కంటె రాజశేఖర్, సంతోష్, మీనాక్షి, గంగాధర్, పుండాలిక్, చంద్రశేఖర్, శ్రీనివాస్, సుకుమార్ పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో వినతులు వెల్లువ

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే గిరిజన దర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. గిరిజన ప్రాంతంలోని వివిధ మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు వచ్చి వినతిపత్రాలను పీఓ వరుణ్ రెడ్డికి అందజేసి తమగోడును వెళ్లబోసుకున్నారు. ఉట్నూరు మండలం దేవానగర్ గ్రామానికి చెందిన రామిడి లక్ష్మి, తనకు ఉపాధి హామీ జాబు కార్డు ఇప్పించాలని కోరారు. బేల మండలం దౌన గ్రామానికి చెందిన కె. లేతుబాయ్ వీరాసత్ భూమి పట్టా మంజూరు చేయాలని విన్నవించారు. బజార్‌హత్నూర్ మండలం భూతాయి గ్రామానికి చెందిన రాథోడ్ రాహుల్ తమకు బోరుబావి, విద్యుత్ మోటార్ మంజూరు చేయాలని కోరారు. ఇంద్రవెల్లి మండలం వాల్గొండ గ్రామానికి చెందిన ఆర్. జౌలాం సింగ్ స్వయం ఉపాధి కొరకు ఆర్థిక సాయం మంజూరు చేయాలని కోరారు. రైతుబంధు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, పోడు భూముల సర్వే, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు అందజేశారు. ఆయా అర్జీలను పరిశీలించిన పీఓ శాఖల వారీగా కేటాయించారు. సమస్యలపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు పీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డా.దిలీప్ కుమార్, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి డా. కొమురం బాలు, ఈఈ రాథోడ్ భీమ్ రావ్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏఓ రాంబాబు, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు ఉన్నారు.



యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్న ఎరువుల దుకాణం యజమానిపై, వారితో కుమ్మక్కై రైతాంగానికి నష్టం చేస్తున్న నిర్మల్ డీఏఓ అంజి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా అమ్మాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోకేశ్వరం మండల కేంద్రంలో ఓ షాపు యజమాని రూ.320కి అమ్మాల్సిన బస్తాను రూ.330కి అమ్ముతున్నాడని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదన్నారు. జిల్లావ్యాప్తంగా కొన్ని దుకాణాల్లో ఇదే దందా సాగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడుడాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జాన్‌పాల్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రామలక్ష్మణ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలో ఖరీఫ్ సాగులో విత్తినం విక్రాంత్, కరిష్మా, కంపెనీలకు చెందిన సోయబీన్ విత్తనాలు మొలవకపోవడంతో వందల సంఖ్యలో రైతులు ఆర్థికంగా నష్టపోయారని, సంబంధిత కంపెనీల నుంచి బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మండల రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాదిత రైతు లక్కం శంకర్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో దుక్కిదున్ని, చదును చేసి రసాయనిక ఎరువులు వేసి వేల ఖర్చు పెట్టి విత్తనాలు కొనుగోలు చేసి విత్తనాలు విత్తామని, కంపెనీల మోసంతో విత్తనాలు మొలవక నట్టేట్ట మునిగామని తెలిపారు. సంబంధిత కంపెనీలపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సంగు నరేందర్, దగ్గరి వెంకటేష్, కొంగర్ల కాశీరాం, గిద్ది శంకర్, దీషి పోషెట్టి పాల్గొన్నారు.

కొనసాగుతున్న జాతర పనులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన కేస్లాపూర్‌లోని నాగోబా ఈ నెల 21 న పుష్యమాసం రోజున మహా పూజతో ప్రారంభం కానుంది. ఈ జాతర ఏర్పాట్లు ఓ పక్షం రోజుల ముందు నుంచే యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నాగోబా వనంలో ఎఫ్‌బీఓ రాథోడ్ జ్యోతి ఆధ్వర్యంలో కొమ్మలు కత్తిరించడం, చెత్త చెదారాన్ని తీసివేయడం నాటిన వివిధ మొక్కలకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయడం, అవసరమైన చోట పెయింటింగ్ చేయడం తదితర పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మరో వైపు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో స్నాన వాటికలు, డ్రైనేజీ పైపులు వేయడం తదితర పనులు కొనసాగుతున్నాయి.


ఎస్పీకి అభినందనల వెల్లువ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి సామాజిక ప్రగతి సూచిక సురక్షితమైన జిల్లాల నివేదికను శనివారం విడుదల చేసింది. అందులో ఐదో స్థానంలో నిలిచి, తెలంగాణలో మొదటి స్థానంలో ఉంది. దీంతో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డితో పాటు పోలీసులను సత్కరించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూల మొక్కలను అందించారు. అదే విధంగా హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఎస్పీని కలిసి సత్కరించారు. సమిష్టి కృషితోనే నేడు జిల్లా దేశంలోనే ఐదో స్థానంలోకి వచ్చిందని, ప్రతి ఒక్కరూ ఇలానే శాంతిభద్రతల పరిరక్షణ కోసం సహకారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. రాబోయే రోజుల్లో మరింత పటిష్టంగా పోలీసు వ్యవస్థను ప్రజలకు అందిస్తామని స్పష్టం చేశారు.

బహిరంగ ధూమపానం నేరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణ ప్రాంగణాల పరిధిలో బహిరంగ ధూమపానం నేరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీకాంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పొగాకు నియంత్రణ బృందం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులు నమిలి ఉమ్మడం, బహిరంగ ధూమపానం చేయడం నేరమని తెలిపారు. పొగాకు ఉత్పత్తులు విక్రయించే దుకాణదారులు కోట్పా చట్టం ప్రకారం హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ధూమపానం చేయరాదు బహిరంగ ధూమపానం నేరం వంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. లేదంటే జరిమానాలతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేయడంతోపాటు ప్రయాణీకులకు పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట తనిఖీ బృందం సభ్యులు చిరంజీవి, గంగారెడ్డి ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 10 జనవరి 2023

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-జన్నారం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండకు చెందిన పందెన అశోక్(35) తన స్నేహితులు ఓరుగంటి వెంకటేశ్, పసీ ప్రవీణ్‌లతో కలిసి హైదరబాద్ నుంచి సిరికొండకు వెళ్తున్న సమయంలో అతివేగంగా కారు నడుపుతూ పైడిపెల్లి గ్రామ సమీపంలో బండరాయిని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్, ప్రవీణ్‌లకు స్వల్ప గాయాలు కాగా, అశోక్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని పోలీసులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో చికిత్స పొందుతున్న అశోక్ ఆదివారం రాత్రి మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నట్లు వివరించారు.

రేపు దివ్యాంగులకు పరికరాల పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఢిల్లీకి చెందిన ఆర్టిఫిషియల్ లింబ్స్ మానిఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) కంపెనీ ఆధ్వర్యంలో జిల్లాలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేయనున్నట్టు ఆ కంపెనీ సీనియర్ మేనేజర్ కేవీ రాజేష్, నిర్వాహకుడు రతన్ జైన్‌లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు కాగజ్‌నగర్ పీహెచ్‌సీ వద్ద, 12న ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు ఆసిఫాబాద్ కలెక్టరేట్ కాంప్లెక్స్ వద్ద పరికరాల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. బ్యాటరీ సైకిల్లు, వినికిడి యంత్రాలు, చేతికర్రలు, కృత్రిమ కాళ్లు తదితర వాటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పరికరాలు అవసరం ఉన్నవారు సదరం సర్టిఫికేట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు ఫోటోలతో హాజరు కావాలని తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-దండేపల్లి

రంగారెడ్డి మన్నేగుడలో జనవరి 13,14 తేదీలలో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజా పిలుపునిచ్చారు. సోమవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి కెకె శైలజ, ప్రముఖ విద్యావేత్త చుక్క రామయ్య, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ఎన్నో సవాలని ఎదుర్కొంటుందని మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు ఏర్పడతాయని ఆశించిన అంతకు తగ్గట్టుగా సహకారం అందంలేదని అన్నారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని అన్ని పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మహాసభలో తీర్మానం ప్రభుత్వానికి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభకు మంచిర్యాల జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొట్టు చంద్రమౌళి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రత్నం తులసిపతి, ఇండ్ల మల్లేశం, మండల కమిటీ సభ్యులు గోపగాని రవీందర్, ప్రసాద్ రావు, ప్రమోద్ పాల్గొన్నారు.

కలెక్టర్ చర్యలను ఖండిస్తున్నాం

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

నిజామాబాద్ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సిబ్బందిపై ఆ జిల్లా కలెక్టర్ నమోదు చేయించిన కేసుకు సంబంధించిన చర్యలను ఖండిస్తున్నట్టు లక్షెట్టిపేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని స్థానిక న్యాయస్థానం ముందు నిజామాబాద్ న్యాయవాది, సిబ్బందిపై పెట్టిన కేసులకు నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ కోర్టు ఈ పీ ప్రొసీడింగ్స్ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన న్యాయవాది, సిబ్బందిపై కలెక్టర్ విధులకు ఆటంకం కలిగించారని పేర్కొంటూ ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టడం సహించలేనిదన్నారు. అంతేకాకుండా నిజామాబాద్ కలెక్టర్ చర్య హేయనీయమన్నారు. ముఖ్యంగా కార్యనిర్వాహక వ్యవస్థ అనేది న్యాయ వ్యవస్థ లో హద్దులు మీరి ప్రవర్తించడం శోచనీయమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడవలసిన బాధ్యతను కార్యనిర్వాహక వ్యవస్థ మర్చిపోరాదని హితవు పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, ఉపాధ్యక్షుడు గాండ్ల సత్యనారాయణ, ఏజీపీ పద్మ, రాజేశ్వర్ రావు, అక్కల శ్రీధర్, కారుకూరి సురేందర్, కొమిరెడ్డి సత్యన్న, నరేందుల సురేందర్, నగురి రవి, అఫ్జల్ బియాబాని, చుంచు తిరుపతిస్వామి, సుమన్ చక్రవర్తి, తాజోద్దీన్ శివశంకర్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నవతెలంగాణ-దండేపల్లి



అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కనీసం నిరస తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పిట్టల తిరుపతి విమర్శించారు. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు హైకోర్టు తీర్పు మేరకు ఏడు మార్కులు కలపాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ప్రగతి భవన్ ముట్టడికి బయలుదేరుతున్న విద్యార్థి సంఘ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తప్పులున్న ఏడు ప్రశ్నలకు ఏడు మార్కులు కలపాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో పిట్టల తిరుపతి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు శనిగరపు మురళీకృష్ణ, ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు నలిమెల వినయ్ ఉన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాన-అసిఫాబాద్

గర్భిణులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని గుండి సర్పంచ్ జాబరి అరుణ అన్నారు. సోమవారం మండలంలోని గుండి గ్రామంలోని గర్భిణులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే రక్తహీనత ప్రభావితమైన ఆసిఫాబాద్ జిల్లాతో పాటుగా మరో 8 జిల్లాలోని గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించినట్లు తెలిపారు. తల్లి బిడ్డలను సురక్షితంగా కాపాడేందుకే పౌష్టికాహారం కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గర్భిణులకు సరైన పోషకాలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పౌష్టికాహారం కిట్లలో 1 కిలోల న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, రెండు కిలోల ఖర్జూరం, మూడు ఐరన్ సప్లిమెంట్ సిరప్‌లు, 500 గ్రాముల నెయ్యి, 5 అల్బెండజోల్ టాబ్లెట్, కప్పులు, ప్లాస్టిక్ బకెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మోహన్, ప్రవీణ్, మల్లేష్, ఏఎన్ఎం సంగీత, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం అడ్డు

- ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్



అవ్వ పెట్టదు.. అడుక్కు తిననివ్వదు అన్నట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ విమ్మర్శించారు. గోదావరి తీర ప్రాంత గ్రామాల వారి సౌకర్యార్థం సోమవారం కుందారం గ్రామంలో రూ.1.56 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు అందించాల్సిన బీజేపీ ప్రభుత్వం అడ్డుపడుతుందని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి సహకారం అందకపోయినా.. కరోనాతో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పట్టుదలతో రాష్ట్రంలో స్వయం సమృద్ధిని సాధించుకుంటున్నామని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి అభివృద్ధి చేయని ఢిల్లీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చినా రూ.10 వేల చొప్పున రైతు బందు ఇస్తే వారు కండ్లు మండుతున్నాయని విమ్మర్శించారు. అయినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధితో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆశిస్సులతో చెన్నూర్ నియోజకవర్గంలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. బడుగు బలహీనవర్గాలు, మారు మూల గ్రామాల వారికి వైద్య సేవలు అందుబాటులోకి తేవటానికి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి భవనం నిర్మాణం జరుగుతుందని తెలిపారు. మరో ఆరు నెలల్లో ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభిచుకోన్నామని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గం కేంద్రంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. నియోజకవర్గం పరిదిలోని వివిధ మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఇప్పటికే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు మరి కొన్ని ఆస్పత్రి భవనాలు నిర్మించుకోనున్నామని పేర్కొన్నారు. కుందారంలో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనంతో గోదావరి తీర ప్రాంత గ్రామాల వారికి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. నిర్మాణ పనులు మే నెల ఆకరుకల్లా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అదేవిధంగా భీమారం మండల కేంద్రంలో కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాల్సివుందని పేర్కొన్నారు. జనవరి 18 నుండి తెలంగాణాలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. గత సంవత్సరం కోటి 54 లక్షల మంది కంటి పరిక్షలు చేయడం జరిగిందని, ఈ సంవత్సరం 100 రోజుల వ్యవధిలో 15 వందల బృందాలు 484 కేంద్రాల ద్వార కోటి 50 లక్షల మందికి కంటి పరిక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండలానికి చెందిన 16 మందికి రూ. 5లక్షల 21 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. జైపూర మండలానికి చెందిన ఏడుగురికి రూ. లక్ష 73 వేలు, కోటపల్లి మండలానికి చెందిన ఎనిమిది మందికి రూ.2 లక్షల 14 వేల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. భీమారం మండలానికి చెందిన ఇద్దరికి రూ.72 వేల విలువగల చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా షాదీ ముభారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సారయ్య ఎంపీపీ గోదరి రమాదేవి లక్ష్మన్, జడ్పీటీసీ మేడి సునిత రవితో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలమూరి అరవిందరావు, కార్యదర్శి పాలమాకుల సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలి

రామకృష్ణాపూర్ : చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు తోడ్పాటునందించాలని, రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. రామకృష్ణాపూర్‌లోని ఆయన స్వగృహలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లతోపాటు, రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలలో మిషన్ భగీరథ పనులను ఈ నెలాఖరి కల్లా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల్లో భాగంగా త్రాగునీరు, ఎలక్ట్రిసిటీ, వీధి దీపాలు, పారిశుధ్యం, వ్యవస్థలన్నింటినీ మెరుగుపరచాలని అన్ని శాఖల ప్రభుత్వాధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయతో పనిచేసి పనులు వేగవంతం అయ్యేలా కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు.

ప్యాకేజీ లీడర్లు వస్తూ పోతుంటారు

- అభివృద్ధి చేసింది కేవలం కోనేరు కోనప్పనే
- ప్రజల్లో ఉంటూ అభివృద్ధి చేశా
- మిగిలున్న పనులు పూర్తిచేస్తా
- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ-బెజ్జూర్



ఈ మధ్య ప్యాకేజీ లీడర్లు వస్తూ పోతున్నారని, ఆ ప్యాకేజీ లీడర్లు ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పనిచేసే వాళ్లనే ప్రజలు ఎప్పుడు మరిచిపోరని, ఆ నాయకులను గుండెల్లో పెట్టుకుంటారన్నారు. తనకు మూడుసార్లు అవకాశమిచ్చిన ప్రజలను తన జీవితంలో ఎప్పుడు మరిచిపోలేనన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ మరికొన్నింటినీ పూర్తిచేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందించిందని, ప్రతి ఇంటికి ఒక సంక్షేమ పథకం అందిందన్నారు. కేవలం బెజ్జూర్ మండలానికే సంక్షేమ పథకాలతో రూ.130 కోట్లు లబ్ధిదారులకు అందాయన్నారు. దూర ప్రాంతం నుంచి వచ్చే పేదవారికి ఆకలి తీర్చేందుకు అన్నదాన సత్రాన్ని ఏర్పాటుచేశామని, దీంతో ఎంతోమందికి ఆకలి తీర్చామన్నారు. వైద్యం పేరుతో దండుకుంటున్న నాయకులు పేద ప్రజలకు ఉచితంగా వైద్యమెందుకు అందించడంలేదని ప్రశ్నించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. త్వరలోనే తునికాకు రాయల్టీ అందజేస్తామని, తమ సత్తా ఏంటో నేటి బహిరంగ సభలో చూపించామని, మాయమాటలు చెప్పే వారికి ఇదో పెద్ద చెంప దెబ్బన్నారు. అనంతరం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో పాటు తన ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అందించారు. ఆదివాసులకు అటవీ భూముల కోసం కోనేరు కుటుంబం జైలుకు సైతం పోయిందన్నారు. కళాశాలల్లో మధ్యాహ్నభోజనం అందించి ఆపద్బాంధవుడిగా నిలిచిన కోనప్పను ప్రజలు గుండెలో పెట్టుకొని చూసుకుంటారన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఇంకో పార్టీ అవసరం లేదని, మళ్లీ గెలిచేది కోనేరు కోనప్పనే అన్నారు. అంతకుముందు సబ్‌స్టేషన్ నుంచి హెలిప్యాడ్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆత్మీయ సమ్మేళన సభకు కమిటీ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సకారాం, ఎంపీపీలు రోజారమణి, చింతలమానెపెల్లి ఎంపీపీ డుబ్బుల నాన్యయ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకన్న, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కోంద్ర జగ్గాగౌడ్, జడ్పీటీసీ పుష్పలత, నాయకులు డోకె వెంకన్న, బషరత్‌ఖాన్, జావీద్, మహేష్, జావీద్ హుస్సేన్, శౌకత్ అలీ పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



సంక్రాంతి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు డిమాండు చేశారు. పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్‌ను సోమవారం భట్టుపల్లి జడ్పీఎస్ఎస్, కాగజ్‌నగర్ కేజీబీవీ, చింతగూడ జడ్పీఎస్ఎస్ పాఠశాలల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి మూల్యాంక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలను మినహాయించాలని, నైట్ డ్యూటీ కొరకు విద్యార్థులకు కేర్ టేకర్ ల ప్రత్యేక నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, కాంట్రాక్టు వ్యవస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, 317 జీఓలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు వారి సొంత జిల్లాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జనరల్ ప్రావిడెంట్ ఫండ్ పాక్షికంగా ఉపసంహరణ, లోన్‌లను వెంటనే మంజూరయ్యే విధంగా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. సప్లమెంటరీ బిల్లులను అదే నెలలో వ్యక్తిగత ఖాతాలో జమ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ ఎన్ మండల అధికారి జాడి దేవాజీ, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముంజంపల్లి రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మడావి హనుమంతు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బైరీ వరలక్ష్మి, పర్శ చంద్రశేఖర్, మండల అధ్యక్షులు ఎనగంటి బిక్షపతి, మండల ప్రధాన కార్యదర్శి పత్తిపాక శ్రావణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుడురి నాగేశ్వరరావు, కుసుమ సుధాకర్, వర్మా జ్యోతి, శ్రీనివాస్, మధుకర్, మండల ఉపాధ్యక్షులు సమత, మంగయ్య, బడుగు శ్రీనివాస్, వాజిగి గులాబ్ రావు, కొమురం శ్రీనివాస్, శైలజా, ప్రదీప్ రావుఫ్, ఆనంద్, నర్మద, రాణి, స్వాతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్టు పాఠశాల ఉపాధ్యాయులు రావనవేని రవీందర్ తెలిపారు. ఇటీవలే మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ఆకుల హర్షిత, సామల మౌనిక రాణించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి తమ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు పేరు తెచ్చారని అన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పాఠశాలలోని తోటి విద్యార్థులు వారిని అభినందించారు.

దాడి కేసులో ఒకరికి 15 రోజుల రిమాండ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణానికి చెందిన మహ్మద్ ఆలీమ్ అలియాస్ అల్లు అనే వ్యక్తి మహమ్మద్‌షాఖాన్‌పై దాడి చేసిన కేసులో జూనియర్ సివిల్ జడ్జి అషదుల్లా షరీఫ్ 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్షెట్టిపేట పట్టణంలోని పిర్దోజ్‌నగర్‌కు చెందిన మహ్మద్‌షాఖాన్ అనే పండ్ల వ్యాపారి బస్టాండ్ ముందు పండ్ల వ్యాపారం చేసుకుంటుండగా నిందితుడు అలీమ్ ఈ నెల 3న తన షాప్ వద్దకు వెళ్లి ఇష్టం వచ్చిన బూతులు తిట్టడంతో పాటు చంపు తనని బెదిరించి వెళ్లిపోయాడు. అంతటితో ఆగకుండా నిందితుడు మరుసటి ఈరోజు మద్యాహ్నం ఒక ఇనుప రాడ్ వెంట తీసుకుని వచ్చి మళ్లీ పండ్ల వ్యాపారి అయిన మహమ్మద్‌షా ఖాన్‌ను తిడుతూ రాడ్‌తో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితున్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చడంతో న్యాయమూర్తి నిందుతుని రిమాండ్‌కు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-దండేపల్లి

యువరాజ్యం స్వచ్ఛంధ సేవ సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో దండేపల్లి మండలంలోని కర్ణపేట్ గ్రామ పంచాయితీ పరిధిలోని పెండ్లిమడుగు గిరిజన గ్రామంలో సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. దండేపల్లి ఎస్సై సాంబమూర్తి చేతుల మీదుగా 20 గిరిజన కుటుంబాలకు 40 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువరాజ్యం స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో చలితో బాధపడుతున్న గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేయడానికి ముందుకు వచ్చిన దాతల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. యువరాజ్యం స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు గత ఆరేళ్లుగా పేదలకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ దుప్పట్లు పంపిణీ కార్యక్రమానికి హాజరైన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు తొట్ల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ యువరాజ్యం స్వచ్ఛంధ సేవ సంస్థ పేదలకు, విద్యార్థులకు, ఒంటరి మహిళలకు చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేయడం వంటి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యువరాజ్యం స్వచ్ఛంధ సేవ సంస్థ వ్యవస్థాపకులు గొర్రె లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చింతకింది మధుసుధన్, గౌరవ సలహాదారులు అత్తే సాగర్ పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలి

నవతెలంగాణ-జన్నారం



వచ్చే హరితహారానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ అరుణరాని పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న నర్సరీని పరిశీలించారు. నర్సరీలో పండ్ల మొక్కల పెంపకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నాటిన మొక్కలకు నీరు పోసి సంరక్షించాలని సూచించారు. ఎంపీఈఓ రమేష్ ఏపీఓ రవీందర్, సర్పంచ్ జాడి గంగాధర్, కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని జైత్‌పూర్ గ్రామంలో సోమవారం బడి బయట పిల్లలను సర్వే నిర్వహించి ముగ్గురు బడి బయట పిల్లలను గుర్తించడం జరిగిందని సీఆర్‌పీ దుర్గం సందీప్ తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి బడి ఈడు పిల్లలుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలురను అర్బన్ రెసిడెన్స్ పాఠశాలలో, బాలికలను కేజీబీవీ పాఠశాలల్లో చేర్పించడం జరుగుతుందన్నారు. మండలంలో ఈ నెల 18వ తేదీ వరకు సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత తల్లిదండ్రులు, గ్రామస్తులపై ఉందని, దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 10 జనవరి 2023

బెల్లంపల్లి ఏరియాలో శాస్త్రవేత్తల పర్యటన

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో సోమవారం శాస్త్రవేత్తలు ఎన్ఐటీకే(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్నాటక) జీకె రాంచందర్, అసోసియేషన్ ప్రొఫెసర్ రమణ పర్యటించారు. సైంటిఫిక్ స్టడీలో భాగంగా బెల్లంపల్లి ఏరియా గోలేటీ ఓసీ ప్రదేశాలు, సమీప గుట్టలను పరిశీలించారు. అనంతరం ఖైరిగూడ ఓసీ రక్షణ కట్టలను పరిశీలించారు. కట్టల రక్షణాత్మక నిర్మాణం కోసం సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జీఎం ఎక్స్‌ప్లోరేషన్ డి శ్రీనివాస్‌రావు, ఏజీఎం ఎక్స్‌ప్లోరేషన్ శివనారాయణరావు, ఎస్ఓటు జీఎం కెహెచ్ఎన్ గుప్తా, ఏరియా సర్వే అధికారి జె చంద్రశేఖర్, మేనేజర్ పాంటింగ్, మహేష్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో మరో ముగ్గురు డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో రెగ్యులర్ డిగ్రీ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డిబార్ అయినట్లు కేయు పరీక్షల నియంత్రణ అదనపు అధికారి డా. నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు డిబార్ అయినట్లు పేర్కొన్నారు. ఇందులో ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల, లక్షెట్టిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఒక్కరు చొప్పున డిబార్ అయ్యారు.

మీసేవా కేంద్ర తనిఖీ

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని మీసేవా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాజేశం తహసీల్దార్ సరితతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి దరఖాస్తుదారుని వద్ద ఎంత తీసుకుంటున్నారని అడిగారు. రూ.వంద అని చెప్పడంతో అంత ఎలా తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీసేవా కేంద్రాలకు వస్తున్న వారి వద్ద అధిక మొత్తం వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీసేవా కేంద్రాన్ని సీజ్ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోపాల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి

నవతెలంగాణ - కౌటాల

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి గావుడె హన్మంతు అన్నారు. సోమవారం మండలంలోని బీవరేటి, తాటిపెల్లి, గోవరేటి, బండలేటి ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వారి నైపుణ్యాన్ని గుర్తించి ఉపాధ్యాయులు బోధన విధానాలను ఉపయోగించి మెరుగైన విద్యనందించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కృత్యాదారణ బోధన చేయాలని, విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. లెసన్‌ప్లాన్, పీరేట్ ప్లాన్ ప్రకారం విద్యాబోధన నిర్వహించి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ రవికుమార్ ఉన్నారు.

ఆట క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఆట(ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్) క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆట జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్, జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ప్రకాష్, ఎస్ఆర్‌పీలు భిక్షమయ్య, వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌ను సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సోనాల గ్రామానికి చెందిన అమృత్‌రావు పాటిల్ ఇటీవల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయనను మండల కేంద్రంలో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు స్వీకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కంది ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సభ్యులు రాజశేఖర్, బొమ్మెత సంఘపాల్ పాల్గొన్నారు.

మూగజీవాల నీరు, ఆహారంపై అవగాహన

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రకృతితో స్నేహంలో భాగంగా మండల కేంద్రానికి చెందిన పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్ పక్షులకు ఆహారానికి బర్డ్ ఫీడర్‌లను ఏర్పాటు చేశారు. అనంతరం పక్షుల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పక్షుల ప్రాముఖ్యత, మొక్కలు, మూగజీవాల అవశ్యకత, వాటికి నీటి తొట్టెలు, పక్షి గూడుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు మాధవి, లింగంపల్లి సంతోష్, మంత్రి శ్యామ్ పాల్గొన్నారు.

కేజీవీల్ రోడ్డుపై నడిపితే చర్యలు తప్పవు

నవతెలంగాణ-సారంగాపూర్

రోడ్లపైన కేజీవీల్ ట్రాక్టర్ నడిపితే చర్యలు తప్పవని ఎస్సై కృష్ణాసాగర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పొలాల్లో కేజీవీల్ వెళ్లేందుకు ప్రత్యేక వీళ్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. డైరెక్ట్‌గా రోడ్లపై కేజీవీల్ ట్రాక్టర్‌ను తిప్పరాదని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలు నాణ్యతగా ఉండాల్సిన రోడ్లు సంవత్సరాలకే పాడవుతాయని తెలిపారు. దీనివల్ల ప్రజాధనం వృధా అవుతుందరి తెలియజేశారు. రోడ్లు పాడవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, అవసరం అయిన చోట కేజీవీల్‌లను ట్రాలీపై పెట్టి తరలించాలని వెల్లడించారు. ఎవరికైనా ఎక్కడైనా రోడ్ల మీద కేజీవీల్ తిరిగి నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలని అన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలియజేశారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుంటాల గ్రామంలో సోమవారం జెడ్పీటీసీ అనిల్ జాదవ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అశోక్, నేరడిగొండ ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి, నాయకులు చందర్, సంతోష్, అనిల్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-బోథ్

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేసేందుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడికి వెలుతున్న నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సై కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షాకీర్, సుమేర్ భాష పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి చెక్కులను మందమర్రిలో బీవన్ భవన్ సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ బాల్క సుమన్ అందజేశారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, లబ్దిదారులకు చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న జూనియర్ బాయ్స్ ఇంటర్ డిస్టిక్ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ లో పాల్గొని విజేతలుగా నిలిచి వారికి బహుమతుల ప్రధానం చేశారు.

అంబేద్కర్ పేరు పెట్టినందుకే ప్రాణహితను వదిలేసిన కేసీఆర్

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ - కౌటాల

తుమ్మిహేటి ప్రాణహిత ప్రాజెక్టుకు అంబేద్కర్ పేరు పెట్టినందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి నుండి కాళేశ్వరానికి తరలించారని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుమ్మిహేటి ప్రాణహిత ప్రాజెక్టుకు అంబేద్కర్ పేరు పెట్టడం పాపమా అని ప్రశ్నించారు. రీడిజైన్ పేరుతో కాసులు దండుకోవడానికి ఈ ప్రాంత ప్రజానీకం నోటిలో మట్టికొట్టారన్నారు. రూ.11కోట్లు నీళ్ల పాలు చేశారని విమర్శించారు. తుమ్మిహేటి వద్దనే ప్రాణహిత ప్రాజెక్టును నిర్మించి తీరాలని డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న సెక్రటేరియట్ భవనాన్ని 300 మంది పోలీసులను కాపలా పెట్టి వారి కోసం ఏడాదికి రూ.18కోట్లు ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు. ఆ డబ్బుతో సిర్పూర్ నియోజకవర్గ ప్రజల కోసం రోడ్లు నిర్మించవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన 317 జీవో వల్ల జిల్లా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 317 జీవోను రద్దు చేయాలని 125 రోజులుగా కౌటాలలో నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులకు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. జీవో నెంబర్ 3ను రద్దు చేసి ఆదివాసులకు అన్యాయం చేశారని విమర్శించారు. పోడు భూములకు పట్టాలిస్తానని సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పత్తి పంటకు క్వింటాల్‌కు రూ.15 వేలు ఇచ్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోనప్ప ఆగడాలు ఎక్కువయ్యాయని తెలిపారు. ఇప్పటికీ ఆంధ్రుల నుండి విముక్తి దొరకలేదన్నారు. నియోజకవర్గ ప్రజలంతా సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కనుసన్నల్లో ఆంధ్ర కాంట్రాక్టర్‌లతో కంకర వ్యాపారం చేస్తున్నారని, ఈ ప్రాంత ప్రజానీకానికి ట్రిప్పు కంకర కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో సిర్పూర్ నుండి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటమి తప్పదన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు బీఎస్‌పీలో చేరారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి హర్షద్‌హుస్సేన్, నియోజకవర్గ అధ్యక్షులు రాంప్రసాద్, గౌతమ్, నాయకులు గౌతమ్, శ్రీనివాస్, మోతిరాం పాల్గొన్నారు.

గిరిజన రైతుల అభ్యున్నతికి కృషి

- కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్ నాయక్



నవతెలంగాణ-తాండూర్

వ్యవసాయ రంగంలో వచ్చే విప్లవాత్మకమైన ఆధునిక సాంకేతికను గిరిజనులకు అందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేశ్వర్ నాయక్ తెలిపారు. సోమవారం గ్రామీణ అభివృద్ధి సంస్థ ఉట్నూర్, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి సంయుక్తంగా నిర్వహిస్తున్న పివిటిజి ప్రాజెక్ట్‌లో భాగంగా 600 మంది గిరిజన రైతులకు జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు వ్యవసాయంలో వస్తున్న నూతన పోకడలను, అధిక దిగుబడులను ఇచ్చే నూతన వంగడాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అందుకు కృషి విజ్ఞాన కేంద్రం సహకారం అందిస్తుందని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు అనువైన అధిక దిగుబడి నిచ్చే మేలైన జొన్న రకాలను కృషి విజ్ఞాన కేంద్రం అందించి అందులో పాటించాల్సిన అధిక దిగుబడి నిచ్చే పద్ధతులను తెలియజేశారు. విస్తరణ శాస్త్రవేత డా.శివకృష్ణ మాట్లాడుతూ గిరిజన రైతులు ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా పండిస్తున్న పంటల మార్కెటింగ్ విధానాన్ని, రైతులు సంఘటితంగా ఉండి తాము పండించిన నాణ్యమైన పంటలను అధిక ధరలకు ఏ విధంగా అమ్ముకోవచ్చో అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు నాగరాజు, స్రవంతి, సతీష్‌కుమార్ తమ విభాగాలకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట, సోనాపూర్, మొర్రిగూడెం గ్రామాలకు చెందిన గిరిజన రైతులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కోసం వార్డుల్లో ప్రత్యేక ఏర్పాట్లు



నవతెలంగాణ- మంచిర్యాల

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం కోసం అన్ని వార్డులలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య తెలిపారు. సోమవారం కంటి వెలుగు కార్యక్రమంపై కౌన్సిల్ సభ్యులకు మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18 నుండి కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్లు బాధ్యతగా తీసుకోవాలని, వార్డులలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అండగా ఉండాలని కోరారు. ఇంటింటికి కౌన్సిలర్లు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం గురించి వివరించాలని తెలిపారు. సమావేశంలో కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వృత్తిలో భాగంగా కోర్టు నుంచి నోటీసులు అందించడానికి వెళ్లిన న్యాయవాది, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిపై కలెక్టర్ కేసులు పెట్టడం సరికాదని బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెండి భద్రేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం విధులను బహిష్కరించి బార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకు న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతోందని, విధి నిర్వహణలో వెళ్లిన క్రమంలో నిజామాబాద్ కలెక్టర్ వారిపై కేసులు పెట్టడం అప్రజాస్వామ్యమని పేర్కొన్నారు. న్యాయవాదులకు రక్షణగా చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకట్ కుమార్, మహేష్, అబ్దుల్ రహీం, దేవేందర్‌సింగ్, తుడుం శ్రీనివాస్, శ్యామ్, రమణయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల వేదిక నవతెలంగాణ

నవతెలంగాణ-బాసర

ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా నవతెలంగాణ ఒక వేదికగా పని చేస్తోందని సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ అన్నారు. సోమవారం నవతెలంగాణ 2023వ సంవత్సర నూతన క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుండి నవతెలంగాణ పేరుతో కొత్త రూపాన్ని సంతరించుకొని ముందుకు వచ్చిన పత్రికను ప్రతి ఒక్కరు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జాదవ్‌కృష్ణ, శంకర్, భీంరావు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

గ్రామాలు ప్రణాళికతోనే అభివృద్ధి చెందుతాయని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను ఎలా సిద్ధం చేసుకోవాలి, ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి అనే విషయాలు తెలియజేశారు. గ్రామాల్లో 9 ఇతివృత్తాలపై పోటీ ప్రణాళికతో ముందుకెళ్తే ఆర్థిక అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని సాధించవచ్చని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉన్న వనరులతో గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసింగ్, ఎంపీఓ గౌరి శంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మనోహర్, వ్యవసాయాధికారి రాజులనాయుడు, సీడీపీఓ విజయలక్ష్మి, ఏపీఓ సతీష్, విద్యుత్, అటవీ శాఖ అధికారులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్టు అందజేత

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి గ్రామంలో గ్రామ సర్పంచ్ చౌదరి సుజాత శ్రీనివాస్ సోమవారం గ్రామంలోని యువకులకు వాలీబాల్ కిట్టును అందజేశారు. గ్రామ యువకులు క్రీడల్లో పాల్గొని గ్రామానికి పేరు తీసుకురావాలని, క్రీడాకారులకు అవసరమైన సామగ్రిని అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శేషుబాబు, యువకులు పాల్గొన్నారు.

పింఛన్‌కు నోచుకోని అంధురాలు

నవతెలంగాణ-చింతలమానపల్లి

మండల కేంద్రానికి చెందిన 51 ఏండ్ల బోయిరే రాధా గత తొమ్మిది సంవత్సరాలుగా అంధత్వంతో బాధపడుతోంది. దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని ఎంపీడీఓ కార్యాలయాలయం చుట్టూ తిరుగుతోంది. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని, జిల్లా కేంద్రానికి వెళ్లి అధికారులతో మొరపెట్టుకున్న ఫలితం లేదని వాపోతోంది. అధికారులు తమనకు పింఛన్ ఇప్పించాలని వేడుకొంటోంది.

రెండున్నర కిలోల గంజాయి పట్టివేత



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లక్కారం పంచయతీ పరిధిలోని వేణునగర్‌లో సోమవారం పోలీసులు రెండున్నర కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఎస్సై భరత్ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొందరు తప్పించుకు పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకుని విచారించగా వారి వద్ద గంజాయి లభ్యమైంది. వెంటనే యువకులు ఫుల్ చంద్, రామేశ్వర్, జ్యోతి, ప్రీతమ్‌కుమార్, కోలా, టేకం రమేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. గాదిగూడ మండలానికి చెందిన ఫుల్ చంద్ తనకున్న వ్యవసాయ పొలంలో అంతర పంటలుగా గంజాయి మొక్కలను సాగు చేయగా భార్యభర్తలు అయిన రామేశ్వర్, జ్యోతిలు గంజాయితో సులువుగా సంపాదించాలని ఆలోచనతో వినియోగదారులకు విక్రయిస్తూ గంజాయి వ్యాపారం చేస్తున్నారు. వారి వద్ద నుండి రెండున్నర కిలోల గంజాయితో పాటుగా 2వేల నగదు, 5 సెల్ ఫోన్‌లు, 2 బైకులు సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలానే దూరలోచనతో కటకటపాలు అవుతున్నారని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, యువకులు మంచి మార్గంలో నడవాలని ఎస్సై సూచించారు. ఈ పెట్రోలింగ్‌లో హెడ్‌కానిస్టేబుల్‌లు దాదా రావు, నాగన్న, కోండిబ రావు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని గూడెం గ్రామానికి చెందిన శాతరాజు వెంకటి(57) బైక్ ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..వెంకటి ఆదివారం సాయంత్రం గ్రామంలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా కన్నేపల్లి గ్రామానికి చెందిన బెర రాజమౌళి బైక్ మీద గూడెం నుండి లక్షెట్టిపేట వైపు వస్తూ అతివేగంగా జాగ్రత్తగా నడిపి బలంగా ఢీ కొట్టాడు. వెంకటికి తీవ్ర గాయాలయ్యాయి. లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతుని అన్న కొడుకు శాతరాజు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కబ్జాదారుడికి నోటీసులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం(కె) పంచాయతీలోని ట్యాంక్ బస్తీకి చెందిన ఇస్లావత్ రాజేశ్వర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన 30 గుంటల ఖాళీ స్థలాన్ని కబ్జా చేయడంతో పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారు. గ్రామపంచాయతీ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం శనివారం పంచాయతీ నోటీస్ ఇవ్వగా తీసుకోకపోవడంతో సోమవారం ఇన్‌చార్జి సెక్రటరీ శ్వేత, పంచాయతీ సిబ్బంది రాజేశ్వర్ ఇంటికి నోటీసు అతికించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలానికి వేసిన కంచె వెంటనే తొలగించాలని, లేదంటే చట్ట ప్రకారం చర్యలుంటాయని తెలిపారు.

నూతన వైద్యులకు సన్మానం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి నూతనంగా వచ్చిన డాక్టర్ భీంరావు, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ శ్రావ్య వాణిలకు మండల ప్రజా ప్రతినిధులు సోమవారం శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ సర్పంచులు సుభాష్, ప్రకాష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

నవతెలంగాణ-బెజ్జూర్

పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ రాజేషం అన్నారు. సోమవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి పల్లె ప్రకృతివనం పరిశీలించారు. అనంతరం రైతులు పలు సమస్యలు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రంగనాయక ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ విశిష్టత గురించి వివరాలను పూజారిని అడిగి తెలుసుకకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీపాల్ ఉన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా పశువైద్యాధికారి మండల ఇన్‌చార్జి అధికారి రమేష్ సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. రెండు ఫిర్యాదులు మాత్రమే అందయని తెలపారు. వాటిని త్వరగా పరిష్కరించి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ ఏపీఎం బుచ్చన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావ్య పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాదం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అనీత దంపతులు అన్నప్రాసాద వితరణ నిర్వహించారు. అయ్యప్ప మాలదారులు శబరిమల బయలుదేరగా ఆలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలదారులు కొత్తపల్లి శ్రీనివాస్ అనీత దంపతులను సన్మానించారు.